క్లుప్తంగా

మూగ జీవాలను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: మూగ జీవాలైన గొర్రెలు, మేకలు, పాడి పశువులను కాపాడుకోవాలని, వాటి సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ ఏడీ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామ సమీపంలో గొర్రెల పెంపకందారులకు ఉరుములు, మెరుపులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఉరుములతో కూడిన వర్షాలు వచ్చినప్పుడు చెట్లు కింద, పాడిబడిన భవనాలు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదన్నారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, వేడి వడగాల్పులు వీచినప్పుడు నీడకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యుడు పి.అనిల్ కుమార్, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణ



ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం నిర్వహణ పద్దులపై కోరాడ కాలనీ పాఠశాలలో మంగళవారం ఆడిట్ నిర్వహించినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. ఆడిటర్ తనుజ్ వర్మ క్యాష్ బుక్, సంబంధిత బిల్లుల ఓచర్లు, పీఎంసీ తీర్మానం, రిజిస్టర్లు పరిశీలించి ఆడిట్ పూర్తి చేశారు. మొత్తం 140 స్కూల్స్‌కు గానూ, 130 పాఠశాలలకు ఆడిట్ జరిగినట్లు వెల్లడించారు.

మాకవరంలో గ్రామ దేవత ఉత్సవాలు



అమ్మవారి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మహిళలు ఘటాలతో అమ్మవారి మందిరానికి చేరుకొని, ముగ్రాటలతో చల్లదనం చేశారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అడంగల్ సమస్యలపై ఫిర్యాదు



తహసీల్దార్ బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: సాగు చేస్తున్న భూములకు అడంగల్లు ఆన్‌లైన్‌లో తమ పేరుతో రావడం లేదని మండలంలోని ఒంద్రుజోల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణలతో పాటు రైతులు తహసీల్దార్ కె.బాలకృష్ణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అడంగల్లు రాకపోవడంతో వ్యవసాయ రుణాలు రెన్యూవల్ కావడం లేదని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సైతం అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. ఆడపిల్లల వివాహాల కోసం భూములు అమ్మకోవాలన్నా అవకాశం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు నిమ్మగడ్డ కృష్ణరావు, సర్పంచ్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కొత్తూరు: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు పనస రమేష్ డిమాండ్ చేశాడు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తూరులో మంగళవారం పలు రంగాలకు చెందిన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని దుయ్యబట్టారు. లేబర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

- అడ్డగోలుగా ఫీజులు వసూలు
- పుస్తకాలు, యూనిఫారమ్ పేరిట అధిక వసూళ్లు
- లబోదిబోమంటున్న తల్లిదండ్రులు

ప్రైవేటు బడి.. దోపిడీ..!



నరసన్నపేటలో ఒక ప్రైవేటు స్కూల్లో విక్రయాలకు ఉంచిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో తదితరులు

నరసన్నపేట: విద్యను వ్యాపారంగా మలచి తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ రోజురోజుకీ పెరుగుతోంది. ఫీజులు మాట సరే.. పుస్తకాలు, యూనిఫారంలు పేరిట వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. తల్లికి వందనం ఇస్తామని కూటమి ప్రభుత్వం మాట తప్పి విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మోపుతుండగా, మరోపక్క నరసన్నపేటలో ప్రైవేటు స్కూల్స్ వసూళ్లు మరింతగా ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు బయటకు చెప్పలేక, విద్యాసంస్థలు అడిగిన మేరకు డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు.

విస్తృతంగా తనిఖీలు

గత మూడు రోజులుగా నరసన్నపేటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులు, పుస్తకాలు, యూనిఫారమ్ పేరిట వసూళ్లు బయటపడ్డాయి. కార్పొరేట్ స్కూల్స్‌లో అయితే ఈ వసూళ్లు మరింతగా ఉన్నాయి. తల్లిదండ్రుల నుంచి వీరి వసూళ్లు చూసి ఎంఈఓలు, ఏబీవీపీ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ ఎవరూ ఖాతరు చేయడం లేదు. తమకు నచ్చిన విధంగా పుస్తకాల పేరిట వసూళ్లు చేస్తున్నట్లు బయటపడింది. నరసన్నపేట లాంటి మేజరు పంచాయతీలో కూడా ఈవిధంగా వసూళ్లు చేయడం శోచనీయమని స్థానికులు అంటున్నారు. ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొన్ని స్కూల్స్‌కు నిబంధనల ప్రకారం సౌకర్యాలు లేవని, నిపుణులైన ఉపాధ్యాయులు లేరని అయినా పుస్తకాలు, యూనిఫారమ్స్ పేరిట వేల రూపాయలు వసూళ్లు చేస్తున్నారని వాపోతున్నారు. పైడితల్లి కూడలి సమీపంలో కూటమి ప్రభుత్వంలో బాధ్యత గల పదవిలో ఉన్న ఒక వ్యక్తికి చెందిన కార్పొరేట్ స్కూల్లో పుస్తకాలు అని చెప్పి రూ.12 వేలు నుంచి రూ.16 వేలు వసూలు చేస్తున్నారు. అలాగే పట్టణంలో సాధారణ ప్రైవేటు స్కూల్స్‌లో కూడా రూ.6 వేలు నుంచి రూ.12 వేలు వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఏబీవీపీ ప్రతినిధులు కోరారు.

నోటీసులు

పుస్తకాల పేరిట వ్యాపారం చేస్తున్న నరసన్నపేటలోని 22 ప్రైవేటు స్కూల్స్‌కు అధికారికంగా ఎంఈవో కార్యాలయం నుంచి నోటీసులు పంపారు. పుస్తకాలు విక్రయాలు చేయవద్దని, వేసవి సెలవుల్లో తరగతులు, ప్రత్యేక క్లాసులు నిర్వహించవద్దని ఆ నోటీసులో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుస్తకాలతో వ్యాపారం చేయకూడదు



నిబంధనల ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వాహకులు పుస్తకాలతో వ్యాపారం చేయకూడదు. దీని పేరిట అధిక వసూళ్లు చేయడం సరికాదు. పలు స్కూల్స్‌లో తనఖీలు చేసినప్పుడు పుస్తకాలు అమ్ముతున్నట్లు గుర్తించాం. ఇది కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే నిబంధనలు ఎవరూ అతిక్రమించవద్దు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదు.
– పి.దాలినాయుడు, ఎంఈవో–2, నరసన్నపేట

దారుణంగా వసూళ్లు చేస్తున్నారు



ప్రైవేటు స్కూల్స్‌లో యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అధిక మొత్తాలకు అమ్ముతుండడం దారుణం. తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి డబ్బులు కట్టించుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇవ్వకపోతే క్లాసుల్లో పిల్లలను నిలబెట్టి అవమానిస్తున్నారు. ప్రైవేటు సంస్థల ప్రతినిధులు మితిమీరి వ్యవహరిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి విద్యా సంస్థల దోపిడీని అడ్డుకట్ట వేయాలి.
– ఎస్ మదన్ కుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నరసన్నపేట

● జయహో..!



పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సైనికులకు సంఘీభావంగా కొత్తూరులో మంగళవారం తిరంగ యాత్రను ఘనంగా నిర్వహించారు. రహదారిపై జయహో నినాదాలతో హోరెత్తించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా మట్టుబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.
– కొత్తూరు

పేదలకు భూములు పంపిణీ చేయాలి



కాశీపురంలో ఉపాధి వేతనదారులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కొత్తూరు: పేదలకు ప్రభుత్వం భూములను పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని కాశీపురంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పలు రంగాల కార్మికులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఉపాధి కూలీలకు చట్టంలో పొందుపరిచిన రాయితీలతో పాటు సౌకర్యాలను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. కౌలు రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

భూములు లేని ఎంతోమంది పేదలు ఉన్నారన్నారు. వారందరికీ ప్రభుత్వం భూములు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఉపాధి పనులను ఒక్కపూట మాత్రమే చేయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వతో ఇక్కట్లు



మేజర్ పంచాయతీ హిరమండలం వైఎస్సార్ కూడలిలో అలికాం –బత్తిలి ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే రహదారిపై నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తోంది. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. – హిరమండలం

ప్రారంభమెన్నడో..?



పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించేదెన్నడోనని విద్యార్థినులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు రూ.12 కోట్ల రూసా నిధులతో డిగ్రీ కళాశాల అదనపు తరగతులు, బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బాలుర వసతి గృహం ప్రారంభించారు. కానీ బాలికల వసతి గృహం అన్ని పనులు పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభించలేదు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, సారవకోట, కొత్తూరు, సారవకొట, మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి విద్యార్థినులు ఈ కళాశాలలో చదవుతుంటారు. అందువలన బాలికల సౌకర్యార్థం వేగవంతంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.
– పాతపట్నం

రైతులకు అవస్థలు



వాతావరణంలో మార్పులతో గత రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం రబీ రెండో పంట ధాన్యంతో పాటు మొక్కజొన్న, అపరాలైన నువ్వులు, పొద్దు తిరుగుడు తదితర పంటలను కొంతవరకు ఇంటికి చేర్చారు. మరికొంత పంటను ఆయా గ్రామాల్లో రోడ్లు, కల్లాల్లో కుప్పలుగా పోసి ఎండబెడుతున్నారు. అయితే ఈ సమయంలో వర్షం పడుతుండడంతో పరదాలు కప్పి జాగ్రత్త చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
– జలుమూరు

ట్రాఫిక్ జామ్



మెళియాపుట్టి మండలంలోని శేఖరాపురం గ్రామంలో గ్రామ దేవత వెలగపోలమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీంతో ఉత్సవ భోజనాలకు సమీపంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు బంధువుల ఇళ్లకు విచ్చేశారు. అయితే అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో గ్రామానికి వెళ్లే దారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కనీసం నియంత్రించేవారు లేకపోవడంతో అవస్థలు తప్పలేదు. – మెళియాపుట్టి

మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకటరమణ

పాతపట్నం: మండల కేంద్రంలో జూన్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా 25వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. స్థానిక బాలాజీ నగర్‌లో ఉన్న ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సమ సమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేటీకరించాలని చూడడం సరికాదన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేసి గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్, పార్టీ నాయకులు ఆదినారాయణ ఆచారి, మోహన్‌రావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆమదాలవలస రూరల్: నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 10వ తరగతి పాసైన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఆమదాలవలస మండలం దన్నానపేట వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రినిపాల్ ఎ.గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఈ ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ అనంతరం పాసైన వారికి పలు పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం జరుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 75690 77449 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సకాలంలో విద్యా కానుక కిట్లు



బ్యాగులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుక కిట్లను సకాలంలో చేర్చాలని డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి సూచించారు. పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు పరిశీలించిన అనంతరం ఎస్ఆర్‌వీకేటీ స్టోర్‌లో బ్యాగుల నాణ్యతను మంగళవారం పరిశీలించారు. ఆమెతో పాటు ఎంఈవో రాజారావు ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జెడ్పీ చైర్‌పర్సన్ విజయతో సాంబశివరావు

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. ఎల్.ఎన్.పేట మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ విజయను శ్రీకాకుళంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులు వస్తాయని, అందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. కూటమి కక్ష సాధింపు చర్యలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఈడీ గడ్డెమ్మ

హిరమండలం: ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణా కార్యక్రమంలో ఉన్నతంగా నైపుణ్యాలు సంపాదించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, ఈవోపీఆర్డీ గోవిందరావు ఉన్నారు.

- ఏటా ముంపు ముప్పు
- కుచించుకుపోయిన కాలువ
- పట్టించుకోని అధికారులు

పోగడవెల్లిపై నిర్లక్ష్యం



లాబర వద్ద మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్



తుప్పలతో నిండిపోయిన ప్రహరాజపాలేంలోని చెరువు చెక్‌డ్యామ్

పాతపట్నం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని బి.గోపాలపురం నుంచి కృష్ణసాగరానికి ఆనుకొని ఉన్న పోగడవెల్లిగెడ్డ అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని సుమారు 2,500 ఎకరాల పంటలకు ఈ గెడ్డ సాగునీరందిస్తోంది. కానీ గెడ్డ నిర్వహణను పాలకులు గాలికొదిలేయడంతో ఏటా ముంపు ముప్పు తప్పడం లేదు. ప్రతిఏటా వర్షాకాలంలో గెడ్డలో ప్రవహించే వరదనీరు అటు తెంబూరు వరకు ఇటు లాబర, సింగుపురం, సన్యాసిరావుపేట మీదుగా హిరమండలంలోకి ప్రవహిస్తోంది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పిచ్చిమొక్కలతో అధ్వానం

పోగడవల్లి గెడ్డలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. దీనికి తోడు ఆక్రమణలు కూడా అధికమవడంతో కాలువ కుచించుకుపోయింది. ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. చిన్న నీటి పారుదలశాఖకు కేవలం చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలే చేపట్టడానికి అవకాశం ఉండడంతో పోగడవెల్లి గెడ్డ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ గెడ్డ ప్రవహానికి బి.గోపాలపురం కాజ్‌వే కొట్టుకుపోతోంది. కానీ ఇక్కడ కాజ్‌వే పూర్తిస్థాయిలో నిర్మించేందుకు చర్యలు చేపట్టలేదు. సింగుపురం రహదారిలో ఉన్న వంతెన, గంగువాడ సమీపంలో బల్లఖాణా వద్ద వంతెనలు గతంలో హుద్‌హుద్ తుపానుకు దెబ్బతిన్నాయి. గుమ్మగెడ్డపై చాకిపల్లి, పాతపట్నం, రొమదల, ఎ.ఎస్.కవిటిలో ఉన్న చెక్‌డామ్‌లు మరమ్మతులకు గురయ్యాయి. ఖరీఫ్ దగ్గర పడుతున్నా అధికారులు ఇంతవరకు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాలకు సాగునీరు అందించే కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో పంట ముంపు తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు



బి.గోపాలపురం వద్ద పోగడవెల్లి గెడ్డపై కాజ్‌వే నిర్మాణం తప్పక చేపట్టాలి. ఈ గెడ్డ నిర్వాహణపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడం తగదు.
– పడాల రంజిత్, గంగువాడ, పాతపట్నం

రైతులను ఆదుకోవాలి



వర్షాలు రాక ముందు చెక్‌డ్యామ్‌ల మరమ్మతులు చేపట్టి రైతులను ఆదుకోవాలి. ఖరీఫ్ దగ్గర పడుతున్నా ఇరిగేషన్ అధికారులు ఇంతవరకు పట్టించుకోవడం లేదు.
– బొంగు శ్రీరాములు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం

ప్రతిపాదనలు పంపించాం

పోగడవెల్లిగెడ్డ, గుమ్మగెడ్డపై ఉన్న చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.
–జి.వి.రమణ, ఎఈ ఇరిగేషన్, పాతపట్నం మండలం.

కంటి వైద్య శిబిరం నేడు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు గౌలివి సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులకు కంటి వైద్య పరీక్షలతో పాటు అవసరమైనవారికి కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కంటి రోగులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.